ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 10 జనవరి 2024





నగదు చెల్లింపులెప్పుడు..?

- నెల రోజులైనా బ్యాంకుల్లో జమకాని ధాన్యం డబ్బులు
- ట్యాబ్‌లో ఎంట్రీ చేసినా చేతికందని వైనం
- ఇప్పటి వరకు చెల్లించింది 50 శాతం మాత్రమే
- యాసంగి పెట్టుబడికి తిప్పలు

మంచిర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం డబ్బులు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం లో కొనుగోళ్లు ప్రారంభించినా ఇప్పటి వరకు నగదు రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి ఆలస్యం లేకుండా నగదు చెల్లింపులు ఉంటాయన్న అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. ధాన్యం కొనుగోలు చేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా నగదు చెల్లింపులు జరపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నెరవేరని కొనుగోలు లక్ష్యం

గతేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి వానాకాలం సీజన్‌లో ధాన్యం దిగుబడి జిల్లాలో కొంత తగ్గింది. గతేడాది 2 లక్షల 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. వానాకాలం సీజన్‌లో దిగుబడి తగ్గడంతో 2లక్షల 15వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకు న్నారు. ఇందులో నుంచి ఇప్పటి వరకు కేవలం లక్షా 27వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయగలిగారు. పంట పొట్టదశలో గూడెం ఎత్తిపోతల పథకంలో సాంకేతిక లోపంతోపాటు అకాల వర్షాల కారణంగా లక్ష్యం మేరకు కొంత పంట దిగుబడి తగ్గింది. ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయిస్తే నగదు చెల్లింపులు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ట్యాబ్ ఎంట్రీ జరిగినా

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ఆపరేటర్లు వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయడం దాదాపు పూర్తి చేసినప్పటికీ నగదు జమలో జాప్యం అవుతున్నట్లు సమాచారం. జిల్లాలోని 19,072 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సుమారు రూ. 280 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో నుంచి ఇప్పటి వరకు రూ.212 కోట్ల విలువగల ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయగా, కేవలం రూ.112 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.68 కోట్లకు సంబంధించి ట్యాబ్ ఎంట్రీ చేయాల్సి ఉండగా రూ. 168 కోట్ల చెల్లింపులు జరగాల్సి ఉంది.

పూర్తికాని ధాన్యం తరలింపు

కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. సరైన సమయంలో ట్యాబ్ ఎంట్రీ చేయకపోవడం, ఎంట్రీ అయినా నగదు బ్యాంకుల్లో జమ కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు చేతికిరాక ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగి సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు. ఆ లోగా వానాకాలం డబ్బులు చేతికి అందితే సాగుకు ఉపయోగపడుతాయని రైతులు భావిస్తున్నారు. యాసంగి సాగుకు ఉపయోగపడేలా డబ్బులను బ్యాంకుల్లో జమ చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి లక్ష్యం చేరలేదు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం కారణంగా లక్ష్యం దరి చేరలేదు. వానాకాలం సాగుకు సంబం ధించి జిల్లాలో మొత్తం 265 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా పౌరసర ఫరాల శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వాటిలో కేవలం 190 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 56 సెంటర్లలో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సెంటర్లు ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. ధాన్యాన్ని కల్లాలకు తరలించి రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థి తులు నెలకొన్నాయి. లారీలు అందుబాటులో లేక ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని సెంటర్ల నిర్వాహకులు చెబుతు న్నారు.

కొనుగోళ్లలోనూ జాప్యం

రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అన్ లోడింగ్‌లో జరుగుతున్న ఆలస్యం కార ణంగా సకాలంలో కొనుగోళ్లు జరగలేదు. ఈ నేపథ్యంలో అకాల వర్షాల కారణంగానూ రైతుకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో నిల్వ ఉన్న ధాన్యం నీటి మునిగింది.

సుస్థిర జీవన విధానంతోనే పర్యావరణ పరిరక్షణ



క్లాత్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

ఏసీసీ, జనవరి 9: సుస్థిర జీవన విధానంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంగళవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని, రాబోయే తరాలకు సుస్థిరమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల పాఠశాలల గ్రీన్ కోర్ క్లబ్బుల ద్వారా పర్యావరణ పరిరక్షణ కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన బట్ట సంచులను ఆవిష్కరించారు. పారుపల్లి పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ బూతం తరిమేద్దాం అనే నాటిక ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు విద్యాసాగర్, శివకిరణ్, వెంకటేశ్వర్లు, యోగేశ్వర్, హెడ్మాస్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

హాజీపూర్, జనవరి 9: దొనబండ, సబ్బెపల్లి, ముల్కల, రాపల్లి, ఘడ్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతుల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం హైద్రాబాద్‌కు చెందిన ఉల్లాస్ ట్రస్టు సభ్యులు ఉపకార వేతనాలను అందించారు. 50 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున రూ.50 వేలను చెక్కుల రూపంలో అందించారు. ట్రస్టు సభ్యులు సురిమిల్ల యుగేందర్, గొర్రె నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు హన్మాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అందజేత

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



రేషన్ షాపు వద్ద బారులు తీరిన ప్రజలు

ఏసీసీ, జనవరి 9: రేషన్ బియ్యం పంపిణీ ఎప్పుడు...? అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు రేషన్ షాపుల్లో మంగళవారం బియ్యం పోశారు. దీంతో లబ్ధిదారులు బియ్యం కోసం క్యూ కట్టారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పిండి వంటల కోసం బియ్యం అవసరం ఉన్నందున ప్రజలు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు.

అప్రెంటిస్‌షిప్‌తో భవిష్యత్‌కు పునాది



మేళాలో మాట్లాడుతున్న అధికారి

శ్రీరాంపూర్, జనవరి 9: ఐటీఐ చదివిన విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ చేయడంతో భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుందని శ్రీరాంపూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం. చందర్ అన్నారు. అప్రెంటిస్‌షిప్ మేళాకు మొత్తం 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 95 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఎంతో మంది ఐటీఐ చదివిన అనంతరం శిక్షణ పొందడం లేదని, దీనివల్ల వారిలో తమ వృత్తిలో నైపుణ్యం పెరగడం లేదన్నారు. ఫలితంగా ఉద్యోగావకాశాల్లో వెనకపడుతున్నారని తెలిపారు. స్నైడర్ ఎలక్ట్రికల్, ఆదర్శ మారుతి, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, తదితర కంపెనీలకు చెందిన బాధ్యులతో పాటు ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



గూడెంలో సత్యదేవుని పూజలు చేస్తున్న దివాకర్‌రావు

దండేపల్లి, జనవరి 9: గూడెం సత్యదేవున్ని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద సాగు చేస్తే అన్నదాతల పంటలు సమృద్ధిగా పండి రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, నాయకులు చుంచు శ్రీనివాస్, చిన్నయ్య, అనిల్, అక్కల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, వెంకటేష్ తిరుపతి, అజయ్, సునిల్, సురేందర్, రాజయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

విష జ్వరంతో యువకుడి మృతి



లచ్చన్న (ఫైల్)

భీమారం, జనవరి 9: మండల కేంద్రంలోని బంజారతండా కాలనీలో విష జ్వరంతో యువకుడు మృతి చెందాడు. బంజారా కాలనీకి చెందిన పల్ల లచ్చన్న (35)కు ఆరు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న వైద్యుల వద్ద చికిత్స పొందాడు. తగ్గకపోవడంతో మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రి లో కుటుంబీకులు చేర్పించారు. పరీక్షలు చేయగా డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి మందులు ఇచ్చారు. అనంతరం ఇంటికి వచ్చిన లచ్చన్న సోమ వారం రాత్రి పరిస్థితి విషమించడంతో మంచిర్యాలలోని ఆసుపత్రికి తర లించారు. వైద్యుల సూచన మేరకు హైద్రాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్ళగా ఫిట్స్ రావడంతో లచ్చన్న మృతిచెందాడు. మృతుడికి భార్య సంధ్యారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. డెంగ్యూతో లివర్, కిడ్నీలపై ప్రభావం పడి మృతి చెందాడని వైద్యులు తెలిపారని కుటుంబీకులు పేర్కొన్నారు.

బొప్పారంలో భారత్ వికసిత్ సంకల్ప యాత్ర

కోటపల్లి, జనవరి 9: ప్రధాని మోదీ భారత్ వికాస్ సంకల్ప యాత్ర మంగళవారం బొప్పారంలో కొనసాగింది. యాత్ర ప్రచార రథంలోని వీడియో స్ర్కీన్ ద్వారా ప్రధాని ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎస్సీమోర్చా అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ ప్రశాంత్, ఎంఎల్‌హెచ్‌పీ ఇంద్రజ, ఏఎన్ఎం విజయలక్ష్మీ, ఆశా కార్యకర్త మల్లక్క, పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి, జనవరి 9: 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలకు ఈనెల 11లోగా అభ్యాసకులు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ బీసగోని శంకర్‌గౌడ్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నిజ ధ్రువీకరణ పత్రాలతో మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రవేశ రుసుం చెల్లించి 2సెట్లు జిరాక్స్ కాపీలను స్థానిక ఉన్నత పాఠశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 8309769067లో సంప్రదించాలన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు

ఏసీసీ, జనవరి 9: తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలు, 7 నుంచి 10వ తరగతుల్లో మిగులు సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో www.telanganams.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందని తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 9 : స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఈ నెల 11న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని గోదావరి రోడ్డులోని ఏకలవ్య ఆశ్రమం సమీపంలోని హరి నిలయ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. రక్తదాతలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

దండేపల్లి, జనవరి 9: బ్యాంకు సేవలను ప్రతీ ఒకరు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అనీల్ సూచించారు. వెల్గనూర్, ద్వారక ఉన్నత పాఠశాలలోని మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బ్యాంకు అధికారి చంద్రకాంత్, సాయికిరణ్ విద్యా ర్థులు పాల్గొన్నారు.

నేడు మున్నూరు కాపుల సమ్మేళనం

శ్రీరాంపూర్, జనవరి 9: నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు కోల్‌బెల్ట్ ఏరియా మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి బి. రాజేశం, యూత్ అధ్యక్షుడు ఎస్. సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

అవిశ్వాసానికి అంతా సిద్ధం

- 12న ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- క్యాంపునకు తరలివెళ్ళిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

నస్పూర్, జనవరి 9: నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాసానికి సిద్ధమైంది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా అధికార మార్పిడితో కౌన్సిల్‌లో బలబలాలు మారిపోయాయి. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మెజార్టీ సభ్యుల సంఖ్యతో చైర్మన్‌పై గత నెల 18న కలెక్టర్‌కు అవిశ్వాస నోటీస్ ఇచ్చారు. ఈనెల 12న 11 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో ఓటింగ్ నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశారు.

● మారిన బలాబలాలు

నస్పూర్ మున్సిపాటీలో 25 వార్డులుండగా 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్-10, కాంగ్రెస్-6, బీజేపీ-3, సీపీఐ-2, నలుగురు స్వతంత్రులు కౌన్సిలర్లుగా విజయం సాధించారు. నలుగురు స్వతంత్రులు బీఆర్‌ఎస్‌లో చేరడం, సీపీఐ ఇద్దరు సభ్యుల మద్దతుతో చైర్మన్‌గా ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్‌గా తోట శ్రీనివాస్‌లు ఎన్నికైయ్యారు. మున్సిపాలిటీ నాలుగేళ్ళ పాలన ముగింపు దశలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. మంచిర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రేంసాగర్‌రావు విజయం సాధించడంతో పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు సీపీఐ సభ్యుల మద్దతు కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య 19కి చేరింది. మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా కొనసాగిన తోట శ్రీనివాస్ పదవికి రాజీ నామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. సంఖ్య బలంతో చైర్మన్‌పై అవిశ్వాస నోటీసును కాంగ్రెస్ సభ్యులు ఇచ్చారు.



నస్పూర్ నుంచి క్యాంపునకు తరలివెళుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

● శిబిరానికి తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

నస్పూర్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు 12 మంది మంగళవారం క్యాంపునకు తరలివెళ్ళారు. మిగిలిన వారు కూడా బుధవారం వెళ్ళే అవకాశం ఉంది. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో ఉండి అవిశ్వాసం రోజున రానున్నారు.

చైర్మన్‌గా 20వ వార్డుకు చెందిన సుర్మిళ్ళ వేణు, వైస్ చైర్మన్‌గా 15వ వార్డు కౌన్సిలర్ గెల్లు రజితలు ఎన్నికయ్యే అవకాశం ఉంది. వీరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడరుగా పని చేశారు.

సమావేశ మందిరాన్ని పరిశీలించిన ఆర్డీవో

మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరాన్ని మం గళవారం ఆర్డీవో రాములు పరిశీలించారు. మున్సిప ల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై ఈ నెల 12న జరుగనున్న అవిశ్వాస తీర్మాన సమావేశం సం దర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవో అధికారు లతో మాట్లాడారు. అనంతరం కార్యాలయంలో నిర్వ హిస్తున్న ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఉన్నారు.



మంచిర్యాల నుంచి క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లు

మంచిర్యాల నుంచి...

ఏసీసీ: మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు క్యాం పునకు తరలివెళ్లారు. ప్రస్తుతం ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నోటీసు ఇచ్చారు. అవిశ్వాసానికి సమయం దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసం నుంచి బస్సులో బయలుదేరి హైద్రాబాద్ వెళ్లారు.

అమెరికాలో గుండెపోటుతో మంచిర్యాల వాసి మృతి



నరెడ్ల సాయిభార్గవ్ (ఫైల్)

ఏసీసీ, జనవరి 9: అమెరికాలో గుండెపోటుతో మంచిర్యాలలోని గౌతమినగర్‌కు చెందిన నరెడ్ల సాయిభార్గవ్ (31) గుండెపోటుతో ఈ నెల 2న మృతి చెందాడు. మంచిర్యాలలోని ట్రినిటీ పాఠశాలలో పదో తరగతి వరకు విద్యనభ్యసించాడు. అనంతరం శ్రీచైతన్య పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. హైద్రాబాద్ ఘట్‌కేసర్‌లోని కృష్ణమూర్తి కాలేజీలో బీటెక్ ఈఈఈ పూర్తి చేశాడు. అనంతరం అమెరికాలోని బోస్టన్‌లో ఎంఎస్ విద్యనభ్యసించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాడు. కాగా సాయిభార్గవ్ తండ్రి నరెడ్ల గిరి మంచిర్యాల పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా తల్లి లక్ష్మీ గృహిణి. కాగా మృతదేహం బుధవారం మంచిర్యాలకు చేరుకునే అవకాశాలున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా

మంచిర్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్, 36వ వార్డు కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు గాజుల ముఖేశ్ గౌడ్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు, ఆర్డీవో, కలెక్టర్‌కు లేఖలు పంపారు. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా గెలుపొందిన అనంతరం వైస్ చైర్మన్ పదవిని గాజుల ముఖేశ్ గౌడ్ చేపట్టాడు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొక్కిరాల ప్రేం సాగర్‌రావు గెలుపొందారు. మున్సిపాలిటీలోని బీఆర్‌ఎస్‌కు చెందిన 18 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్‌పై అవిశ్వాసం నోటీసును కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 11న అవిశ్వాసంపై ఓటింగ్ చేపట్టనుండగా, రెండు రోజుల ముందుగానే ముఖేశ్ గౌడ్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

క్రీడాకారుడిని అభినందించిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 9 : ఈ నెల 4 నుంచి 7 వరకు హైద్రాబాద్‌లో జరిగిన మాస్టర్స్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మందమర్రికి చెందిన సీనియర్ మాస్టర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పల్లెం రాజలింగు విన్నర్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించాడు. మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్ రాజలింగును అభినందించారు. బ్యాడ్మింటర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ ఎడ్ల మహేష్, సుధాకర్, గాజుల ముఖేష్‌గౌడ్, మీనారెడ్డి, సత్యపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నరేందర్‌లు పాల్గొన్నారు.

46 మందికి కంటి ఆపరేషన్‌లు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 9 : రేకుర్తి కంటి ఆసుపత్రి, గర్మిళ్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా 46 మందికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు నిర్వహించారు. ఆపరేషన్‌లు చేయించుకున్న వారిని మంగళవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోదుంపురం వెంకటేశ్వర్, డైరెక్టర్ గాజుల ముకేష్‌గౌడ్, జోన్ చైర్మన్ రాంచందర్‌లు పరామర్శించారు. సభ్యులు శంకర్‌లింగం, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూరు, జనవరి 9: కిష్టంపేటలోని ఆదిశంకరాచార్య జిన్నింగు మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం పత్తిని సరి చేసే డోజర్ పైప కాలిపోవడంతో మంటలు చెలరేగాయి. సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు 5 క్వింటాళ్ల వరకు పత్తి కాలిపోయిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు





ఆపరేషన్ స్మైల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు, సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 9: అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలించడాన్ని నియంత్రించేందుకు పోలీసు, రెవెన్యూ గనుల శాఖల అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుక తరలించే ప్రాంతాలను 24 గంటలు పర్యవేక్షించాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల యాజమానులకు రెండు సార్లు జరిమానాలు విధించాలని, అయినా తరలిస్తే కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశా మేరకు త్వరలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఇసుక రవాణా చేసే కాలేజీ రోడ్డు, పాత మంచిర్యాల, ముల్కల్ల ప్రాంతాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, గనుల శాఖ అధికారి బాలు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్, తహసీల్దార్‌లు, ప్రతాప్, శశికుమార్, భూగర్భ జల శాఖ అధికారి గణేష్ పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

రైసుమిల్లులకు కేటాయించిన సీఎంఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ 2022-23 వానాకాలం సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా తప్పనిసరిగా మిల్లింగ్ చేసి సకాలంలో పంపించాలన్నారు. రైసుమిల్లుల్లో సీఎంఆర్ పెండింగ్ ఉన్నట్లయితే మళ్లీ ధాన్యం కేటాయించవద్దని అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్, జిల్లామేనేజర్ గోపాల్, రైసుమిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాంతయ్య, పాల్గొన్నారు.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో చేపట్టిన మాతా శిశు ఆసుపత్రి, హాజీపూర్ మండలం గుడిపేటలో కొనసాగుతున్న వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ ఏఈ అనూషతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను అక్టోబరులోగా పూర్తి చేయాలని సూచించారు.

బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆపరేషన్ స్మైల్ 10, భేటీ బచావో-భేటి పడావోలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంక్షేమం, రక్షణ, పునరావాసంపై అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆపరేషన్ స్మైల్10లో భాగంగా ఈనెల 31 వరకు రైసుమిల్లులు, భవన నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, గ్లాస్ కటింగ్ ప్రదేశాలు, వ్యాపార సంస్థలను పర్యవేక్షిస్తూ బాల కార్మికులను, భిక్షాటనలో ఉండే పిల్లలను గుర్తించాలన్నారు. వీరిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలల్లో, బాలల పరిరక్షణ కేంద్రాలకు అప్పగించాలన్నారు. భ్రూణహత్యల నివారణకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు లేని గ్రామాలకు ప్రోత్సహకాలు అందించడంపై ప్రచారం చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, బాలల పరిరక్షణ సమితి చైర్మన్ వాహిద్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, బాలల సంరక్షణ అధికారి ఆనంద్, వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, పాల్గొన్నారు.

పులి కదలికలపై కొరవడిన నిఘా

- వరుస ఘటనలతో అధికారులు అప్రమత్తం

కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్, జనవరి 9: కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో వరుసగా పులుల మృత్యువాత పడుతున్న ఘటనపై అధికారులు నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. శనివారం ఆడ పులి మృత్యువాత పడడంతో ఒక్క సారిగా అలజడి చోటు చేసుకుంది. పులి మృతికి అధికారులు ఆడపులుల ఆవాసం అని చెప్పుకొచ్చారు. సోమవారం మరో పులి చెందడంతో అధికారుల వైఫల్యమేనని విమర్శలు చోటు చేసుకొన్నాయి. రాత్రికిరాత్రే పోస్టుమార్టం చేసేందుకు పశువైద్యాధికారితో పాటు ఇతర అధికారులను ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పీసీసీఎఫ్, సీసీఎఫ్ అధికారులతో తోపాటు ఎన్టీసీఏ సభ్యులు తాము వచ్చే వరకు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ముందస్తుగానే అటవీ శాఖ అధికారులు తేరుకుంటే పులుల ప్రాణులు పోయేవి కావని వన్యప్రాణి ప్రేమికులు చెబుతున్నారు. మహారాష్ట్ర మీదుగా సిర్పూరు(టి), వేంపల్లి, సర్కపల్లి, దరిగాం, వాంకిడికి పోయేందుకు కారిడార్ ఉండడంతో నిత్యం ఈ మార్గంలో పులులు సంచస్తున్నట్టు, ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

● **ఆరు కిలోమీటర్లు..**

సరిగ్గా కాగజ్‌నగర్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో దరిగాం గ్రామం ఉంది. గ్రామానికి చుట్టు మరో ఆరు కిలోమీటర్ల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతం ఉండడం విశేషం. ఈ గ్రామం నుంచి నిత్యం ఈ గ్రామాల వారు కాగజ్‌నగర్‌కు రాక పోకలు సాగిస్తుంటారు. కూత వేటు దూరంలోనే రెండు పులులు మృత్యువాత పడటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేగింది. మహారాష్ట్రలోన తడోబా, తిప్పేశ్వర్ మీదుగా కాగజ్‌నగర్ బ్రీడింగ్ కేంద్రానికి పులులు వస్తున్నాయి. ఈ మార్గంలోనే ఆడ పులులు పిల్లలకు జన్మనిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో అధికంగా పులులుసంచరిస్తున్న ప్రాంతం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం కావడం విశేషం.

శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 9: పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు మంగళవారం కేరళ రాష్ట్రంలోని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. 41 రోజుల మండల దీక్షల అనంతరం స్థానిక అయ్యప్ప ఆలయంలో రెబ్బెన మండలానికి చెందిన గురుస్వామి మనునూరి సూర్యభాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో గురుస్వాములు దూడల అశోక్, సంతోష్, వేణుగోపాల్, సంతోష్, గణేష్ తదితరులు ఉన్నారు..

వాంకిడి: మండలానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిమలకు బయలుదేరారు. 41 రోజుల మండల దీక్ష అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు బయలు దేరారు.

ఐసీడీఎస్ సిబ్బంది పని తీరు మార్చుకోవాలి

కెరమెరి, జనవరి 9: ఐసీడీఎస్ సిబ్బంది పని తీరు మార్చుకోవాలని సూపర్‌వైజర్ లత అన్నారు. గోయగాం-1, గోయగాం-2, భీమన్‌గొంది గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గోయగాంలోని కేంద్రంలో పిల్లలు లేక పోడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్ర పథకాలపై అవగాహన

వాంకిడి, జనవరి 9: మండల కేంద్రంలోని కోలాం సంఘం భవనంలో కోలాం గిరిజనులకు కేంద్ర పథకాలపై మంగళవారం డీడీఎం వీరభద్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి జన్ మన్ ధన్ పథకం అమలు, లావాదేవీల నిర్వహణ, బీమా పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చౌపన్‌గుడ సర్పంచు సీడాం అన్నిగ, నిర్వాహకులు కోవ హన్మంతు, సీఎస్‌పీ భిక్షపతి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుమిలన్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జైనూర్, జనవరి 9: లంబాడాలు ఈ నెల 11న నిర్వహించనున్న గురు మిలన్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని లంబాడాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ గణపత్ నాయక్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో రాథోడ్ రాందాస్, జాదవ్ హెహన్ నాయక్, ధర్మేందర్, పండిత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

సిర్పూర్(టి), జనవరి 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధికారులు తనిఖీ చేశారు. పాఠాల ఆవరణలో మురుగు నీటితో అపరిశుభ్రత నెలకొనడంతో ఆంధ్రజ్యోతి జిల్లా అనుబంధంలో మంగళవారం ప్రచురితమైన ' అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణ 'వార్త కథనానికి ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఈఓ కృష్ణమూర్తి స్పందించారు. పాఠశాలల పరిసరాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ అధికారులు మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

బెజ్జూరు, జనవరి 9: గిరిజన ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలలో భారత తొలి మహిళా ముస్లిం ఉపాధ్యా యు రాలు ఫాతిమా షేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా పూల మాలల వేసి నివాళులు అర్పించారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

హాజీపూర్, జనవరి 9: మండలంలోని నర్సింగాపూర్‌లో మంగళవారం శ్రీరామ జన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. ట్రస్టు మండల సంయోజక్ బొలిశెట్టి తిరుపతి మాట్లాడుతూ రామజన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో వచ్చిన అక్షింతలను శుభాకార్యాలకు వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 22న ఐదు దీపాలను వెలిగించాలని సూచించారు. వెంకటి, సత్య నారాయణరావు, సుశీల, నారాయణ, లక్ష్మయ్య, రామయ్య, లచ్చన్న, మల్లేష్, సత్యనారాయణరావు, అంజి, చారి, నందయ్య, అంజయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: చెల్కగూడ రామాలయంలో రాముడి అక్షింతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటా అయోధ్య రాముని అంక్షితలను పంపిణి చేశారు.

నెన్నెల: అయోధ్య రాముని పూజిత అక్షింతలు కొత్తూరుకు చేరాయి. అక్షింతలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళహారతులు, కోలాటాలతో పల్లకిలో అక్షింతల కలశాన్ని ఊరేగించారు. ఇంటింటికి అక్షింతలను అందజేశారు. సర్పంచ్ ఎన్క మల్లయ్య, నాయకులు తలండి పోచమల్లు, మోహన్, కొయ్యడ సతీష్, మధూకర్, రాజు, నారాయణ, పోచం, రవి తదితరుల పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని చిర్రకుంట గ్రామంలో మంగళవారం ఇంటింటికి పంపిణీ చేశారు. సంజీవరావు, ఎనగందుల సత్యం, జనార్దన్, రాజయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి



మంచిర్యాలలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, నస్పూర్‌లో పరిశీలిస్తున్న జేడీ నారాయణ

ఏసీసీ, జనవరి 9: ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతి ప్రసాద్‌తో కలిసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అందించిన దరఖాస్తు ఫారాల్లో పొందుపర్చిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దరఖాస్తుల వివరాలను 17వ తేదీ లోగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదుపై ఇదివరకే తహసీల్దార్, వార్డు అధికారులు, ఎంపీడీవోలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు.

నస్పూర్: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేట్ జాయింట్ డైరెక్టర్ నారాయణ అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. మున్సిపాలిటీలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు ఎన్ని ఆన్‌లైన్ చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పనులు పూర్తి చేయాలని అధికారులను జేడి ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, ఆర్‌ఓ సతీష్ సిబ్బంది ఉన్నారు

కాసిపేట: అభయహస్తంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ భోజన, ఎంపీడీవో ఆలీం, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్, జనవరి 9 : రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ముదిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పర్యావర ణం-సంక్రాంతి సంప్రదాయం అనే అంశంపై విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి, సర్పంచు దుగుట జ్యోతి, ఉపాధ్యాయులు, ప్లాంటేషన్ మేనేజర్‌లు సురేష్‌కుమార్, లక్ష్మణ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పవన్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ మాజీ సీఎంను సన్మానించిన ఏమాజీ

బెల్లంపల్లి, జనవరి 9: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ సన్మానించారు. మంగళవారం కరీంనగర్‌కు వచ్చిన ఆయనను కలిసి సన్మానించారు. అనంతరం పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం జాతీయముఖ్య నాయకులను కలిసినట్లు ఏమాజీ తెలిపారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఈటెల రాజేందర్, రాష్ట్ర ఇన్‌చార్జీలు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, అరవింద్ మీనన్ , డీకే అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెంచికలపేట, జనవరి 9: మండలంలోని లోడ్‌పల్లి గ్రామంలో టీజీబీ ఎల్కపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షర్యాతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రాప్‌లోన్, హౌజింగ్‌లోన్, ఎడ్యూకేషన్ లోన్, గోల్డ్ లోన్, రుణమాఫి, సామాజిక భద్రత పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి భీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజేశ్వర్‌రావు, సర్పంచ్ శ్రీనివాస్, కళాజాత బృందం సభ్యులు తేజ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



వాహనాలకు నంబర్లు వేయిస్తున్న సీఐ బన్సీలాల్

బెల్లంపల్లి, జనవరి 9: బెల్లంపల్లి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద మంగళవారం వన్ టౌన్ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని, నెంబరు ప్లేట్ సరిగ్గా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. నెంబరు ప్లేట్ లేని 7 బైక్‌లను సీజ్ చేశారు. ఒక డ్రంకెన్ డ్రైవ్, 67 ఈచాలన్లు విధించారు. నెంబరు ప్లేట్ వాహనాలకు నెంబర్లు వేయించారు. సీఐ మాట్లాడుతూ ప్రతీ వాహన దారుడు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఎస్‌ఐ ప్రవీణ్, పోలీసులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేని 13 బైక్‌లు సీజ్ చేసి, 42 ఈ-చలాన్లు, 1 డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది కలిసి రామకృష్ణాపూర్‌లోని ప్రధాన కూడళ్ళ, క్యాతన్‌పల్లి రైల్వే గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.సీఐ మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్‌తోపాటు మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని కోరారు. రామకృష్ణాపూర్, దేవాపర్, మందమర్రి, కాసిపేట ఎస్సైలు రాజేశేఖర్, ఆంజనేయులు, చంద్రకుమార్, గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసు నిందితుల బైండోవర్

నెన్నెల: గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేశారు. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన దూత ప్రశాంత్, ఏస్కూరి శశికుమార్‌లు గతంలో గంజాయి విక్రయిస్తు పట్టుబడ్డారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిందితులను బైండోవర్ చేసినట్టు ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కోలిండియా లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

మందమర్రిటౌన్, జనవరి 9 : కోలిండియా లాన్ టెన్నిస్ పోటీలు సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలకు ఎంపికైన సింగరేణి జట్టు పాల్గొంది. సింగరేణి టీం మేనేజర్‌గా కేకే 5 గని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మాస్కుల కార్తీక్ వ్యవహరిస్తున్నారు.

బెంచీలు అందజేత

కాసిపేట, జనవరి 9 : ముత్యంపల్లి క్రీడా మైదానానికి చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్‌ల తండ్రి కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థం కాసిపేట కాంగ్రెస్ మండల కమిటీ నాయకులు బెంచీలను అందజేశారు. క్రీడా మైదానానికి వచ్చేవారి సౌకర్యార్థం బెంచీలు అందజేసినట్లు తెలిపారు. అలాగే ముత్యంపల్లి ఉద్యానవనంకు కూడా బెంచీలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి, జాడి శివ, కిరణ్‌కుమార్, శంకర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో మేక మృతి

నెన్నెల, జనవరి 9: నార్వాయిపేట రైతు కున్సోత్ ఫౌర్యనాయక్‌కు చెందిన మేక మంగళవారం కరెంట్‌షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులోని పంట పొలాల్లో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెల్లిన మేకకు తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. రూ.15 వేలు నష్టం జరిగిందని, పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఫౌర్య కోరాడు.

ఫెర్టిలైజర్ దుకాణం తనిఖీ

జన్నారం, జనవరి 9: మండల కేంద్రంలోని వెంకటరమణ ఫెర్టిలైజర్ దుకాణాన్ని మంగళవారం ఏఈవో సంగీత తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌లు, బిల్‌బుక్స్‌లను పరిశీలించారు. పెండింగ్ డీడీలు ఏమన్నా ఉంటే వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ పాస్ మిషన్‌ల ద్వారా ఎరువుల విక్రయాలను జరపాలని షాపు యాజమాని గుండ ప్రభాకర్‌కు సూచించారు.

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ల విడుదల

కన్నెపల్లి, జనవరి 9: కన్నెపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను ప్రధానోపాధ్యాయుడు కజ్జం రమేష్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించాలని, పెండింగ్ బిల్లులు, 3 డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు , రాజేశ్వర్, సభ్యులు సతీష్, కార్తీక్, మోహన్, విజయలక్ష్మీమాలతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించాలి



డీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న రాంకిషన్‌నాయక్

ఆసిఫాబాద్, జనవరి 9: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తే ఆదిలాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని ప్రభుత్వ పరిశ్రమ శాఖ ఉమ్మడి జిల్లా విశ్రాంత అధికారి జాదవ్ రాంకిషన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనది సొంత మండలం జన్నారం అని చెప్పారు. మూడు దశాబ్దాలకు పైగా ఉట్నూర్‌లో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. చదవుకునే రోజుల్లో విద్యార్థి సంఘ నాయకుడిగా పని చేసినట్లు తెలిపారు. బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఏపీఎస్సీ ద్వారా 1990లో పరిశ్రమల శాఖలో ఉద్యోగం సాధించినట్లు చెప్పారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొంది ఉమ్మ జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా 2020లో పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రీయాశీలకంగా పని చేస్తున్నట్లు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుపటేల్‌కు అనుకూలంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే పోటీ చేసి గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం బయోడేటాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుకు అందజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మునీర్ అహ్మద్, నాయకులు కౌసర్, లక్ష్మీకాంత్, కనకారావు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తొలగించాలి

వాంకిడి, జనవరి 9: వాంకిడి మండలంలోని అఖని గ్రామంలో ఇళ్ల పై నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని మంగళవారం జిల్లా విద్యుత్ శాఖ అధికారికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని పలు ఇళ్ల పై నుంచి విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు. వేసవి కాలంలో ఈదురు గాలులకు షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగుతున్నాయని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్క్‌షాప్‌నకు మండలవాసులు హాజరు

జైనూర్, జనవరి 9: మహారాష్ట్రలోని గడ్చీరోలి జిల్లా గోండ్వాన యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన గోండి భాష డిక్షనరీ వర్క్‌షాప్‌నకు జైనూర్ మండలానికి చెందిన పలువురుఉ హాజరైనట్లు గోండి భాష పండితులు కోట్నాక భీంరావ్ అన్నారు. మండల కేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడారు. గోండి భాష వర్క్ షాప్‌లో 8 రాష్ట్రాలకు చెందిన భాష ప్రముఖులు హాజరు అయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా వారు గోండి భాష పదాలపై విశ్లేషణ చేస్తు సరైన పదాలను డిక్షనరిలో కోడికరిస్తున్నారని అన్నారు. మరి కొద్ది రోజుల్లోని గోండి భాష డిక్షనరీ సిద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో భాష పండితులు కోరెంగ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ

పెంచికలపేట, జనవరి 9: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతను మంగళవారం మండలంలోని గుంట్లపేట, లోడ్‌పల్లి గ్రామాల్లో గడపగపడకు పంపిణీ చేశారు. గుంట్లపేట గ్రామంలో అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. 22వ తేదీన సోమవారం రోజున అయోధ్యలో విగ్రహ ప్రణప్రతిష్ట రోజున ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లలో ఐదు దీపాలు వెలిగించి దీపోత్సవ పండగ జరుపుకోవాలని పూజారులు తెలిపారు. అదే రోజున ఆలయం లో హోమం గుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి చంద్రమౌళి, శ్రీనివాస్, మహేష్, మొగిలి, భీమయ్య, రాజయ్య, భీమ య్య, ప్రభాకర్, వైకుంఠం, గణేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

లింగాపూర్, జనవరి 9: మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన జాదవ్ ఇందల్ ఆనే రైతుకు చెందిన ఐదు క్వింటాళ్ల పత్తి మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కాలిపోయింది. సమాచారం మేరకు ఆర్‌ఐ ప్రకాశ్ పరిశీలించారు.

క్రమశిక్షణతో చదవాలి

లింగాపూర్, జనవరి 9: విద్యార్థులు లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదువాలని ఏసై ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు. నవశక్తి దుర్గమాతా పీఠాధిపతి కిషన్ మహారాజ్ అందించిన పుస్తకాలను నవశక్తి దుర్గమాతా సంస్థ సభ్యుడు జాదవ్‌శేఖర్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ మధుకర్, మోహిన్, సుస్మిత. హేమబిందు, సుజాత తదితరులు పాల్గొనారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

బెజ్జూరు, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం అమలు చేసున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వీడియో మొబైల్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బాలకృష్ణ, సపవత్ భిక్షపతి, మహేష్, తిరుపతిగౌడ్, దిలీప్‌కుమార్, రామయ్య, ఎంపీటీసీ వెంకటేష్, సునీల్, తిరుపతి, రమేష్, మోహన్, ఎ.తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కుమరం భీం జిల్లా వార్తలు

8 బుధవారం 10 జనవరి 2024



విష ప్రయోగంతోనే పులి మృతి

మృతి చెందిన పులి

- ప్రయోగశాలకు అవశేషాలు
- విచారణ వేగవంతం చేసిన అధికారులు
- ఘటన స్థలాన్ని సందర్శించిన పీసీసీఎఫ్, ఎన్టీసీఏ బృందం
- పోస్టుమార్టం తర్వాత కళేబరాల దహనం
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కాగజ్‌నగర్/కాగజ్‌నగర్ టౌన్, జనవరి 9: కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో సోమవారం మృతి చెందిన పులి విషప్రయోగం వల్లనే చనిపోయినట్టు అటవీ శాఖ ఉన్నతాధికారులు తేల్చేశారు. కాగజ్‌నగర్ అడవుల్లో పెద్ద పులులు మృత్యువాత పడిన ఘటనపై మంగళవారం రాష్ట్ర పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు) డోబ్రియాల్, సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు) శాంతారాంతో పాటు ఎన్టీసీఏ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) సభ్యులు కాగజ్‌నగర్ సమీపంలో దరిగాం అడవుల్లో ఘటన స్థలాన్ని సందర్శించారు. పులులు మృత్యువాత పడిన పరిస్థితులు, ఇతర అంశాలను కూలంకుషంగా అధ్యాయనం చేశారు.

శనివారం మృతి చెందిన రెండేళ్ల వయస్సు కలిగిన పులితో పాటు సోమవారం వెలుగులోకి వచ్చిన ఆరేళ్ల వయస్సు కలిగిన మగ పులి(ఎస్9) ఏ పరిస్థితుల్లో మరణించాయన్న దానిపై ఆధారాలు సేకరించారు. దరిగాం అటవీ ప్రాంతంలోని బురద మామిడి వద్ద మృతి చెందిన ఆరేళ్ల వయస్సు కలిగిన మగ పులి మెడకు ఉచ్చు ఉండటం గమనించారు.

అయితే సమీపంలోనే ఓ ఆవు కళేబరం పడి ఉండటంతో, ఆవుపై విష ప్రయోగం చేసి పెద్దపులిని చంపి ఉంటారని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా సోమవారం మృతి చెందిన పులికి మెడకు ఉచ్చు ఉన్నట్టు, ఇది వదులుగా ఉన్నట్టు అధికారులు తేల్చడంతో పక్కాగా విష ప్రయోగం వల్లే చని పోయందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దీంతోనే విష ప్రయోగం జరిగిన అనుమానాలకు బలం చేకూరుతోంది. శనివారం మృతి చెందిన ఆడ పులి విష ప్రయోగంతోనే అనుమానాస్పద స్థితలో మృతి చెందిందని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనాలు ప్రచురితమయ్యాయి.

రాత్రి నుంచి గట్టి నిఘా..

సోమవారం దరిగాం బురదమామిడి వద్ద మగ పులి చని పోవడంతో అటవీ శాఖ అధికారులు రాత్రి నుంచి నిఘా పెట్టారు. ఈ పరిసర ప్రాంతాల్లోకి ఎవరిని అనుమతించలేదు. రాత్రే పోస్టుమార్టం చేసేందుకు ఏర్పాట్లు చేయగా, ఎన్టీసీఏ బృందం సభ్యుల సూచన మేరకు ఈ ప్రక్రియను చేపట్టలేదు. మంగళవారం ఉదయం రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఎన్టీసీఏ బృందం సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులపై అధ్యాయనం చేశారు.

మహారాష్ట్ర నుంచి వాంకిడి వరకు ఉండే కారిడార్‌లో పులులు వరుసగా మృత్యువాత పడడం పై అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో విచారణకు దిగారు. దరిగాం, సర్కపల్లి అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరుగటం ఈ గ్రామాల వారిని కూడా వాకాబు చేశారు. పులి సమీపంలో ఉన్న ఆవు ఎవరిది..? ఎలా చని పోయింది..? అనే వివరాలు గ్రామస్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అలాగే పది కిలోమీటర్ల మేర సిబ్బంది జల్లెడ పడుతున్నారు. ఈ విషయంపై పీసీసీఎఫ్ డోబ్రియాల్ మాట్లాడుతూ దరిగాం అడవుల్లో మృతి చెందిన పులుల అవశేషాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించావని చెప్పారు. పులులపై విష ప్రయోగం జరిగిందా.. లేదా అనే విషయం లాబ్యారేటరీ పరీక్షల తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.. ప్రస్తుతం ప్రాథమిక విచారణలో విష ప్రయోగం జరిగినట్టుగా అనుమానిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే అన్నీ వివరాలను వెల్లడిస్తామన్నారు. ఇతర పులుల అన్ని కూడా సురక్షితంగా ఉన్నట్టు తెలిపారు. రెండు పులుల కళేబారాన్ని, ఆవు కళేబారాన్ని దహనం చేసినట్టు వివరించారు.



సోమవారం మృతి చెందిన మగపులిని పరిశీలిస్తున్న అధికారులు



పులి కళేబరాన్ని దహనం చేసిన సిబ్బంది

కె17 మగ పులి మిస్సింగ్?

ఇదే అటవీ ప్రాంతంలో ఉన్న కె17 మగ పులి మిస్సింగ్ అయినట్టు ప్రచారం జరిగింది. ఈ విషయంపై అటవీ శాఖ అధికారులు రాత్రి నుంచి ట్రాకర్ల సహాయంతో గుర్తించేందుకు ప్రయత్నాలు చేశారు. కాగా అటవీ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

అధికారులపై వేటుకు రంగం సిద్ధం?

వరుస పులుల మృత్యువాత పడిన తర్వాత రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులు తేరుకున్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై రంగం సిద్ధం చేస్తున్నారు. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి సిబ్బంది వరకు వేటు పడే అవకాశాలున్నట్టు సమాచారం. త ఘటనలో పలువురికి మెమోలు అందజేసినట్టు సమాచారం.

నిజనిర్ధారణలో విసరా పరీక్షే కీలకం

ఆసిఫాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పెద్దపులుల మరణం మిస్టరీ అధికారులు సేకరించిన శరీర విభాగాలను విసర పరీక్ష చేయడం ద్వారా వెలుగు చూసే అవకాశం ఉంది. వాస్తవానికి మరణాలు సంభవించినప్పుడు అందుకు గల కారణాలపై దర్యాప్తు బృందాలు ఒక నిర్ధారణకు రాలేక పోయినప్పుడు ఇలాంటి పరీక్షపైనే ఆధార పడుతారు. అనుమానాస్పద పరిస్థితుల్లో సంభవించిన మరణాలకు సంబంధించి దర్యాప్తు బృందాలు మృత శరీరాల నుంచి కీలకమైన అంతర్భాగాలు సేకరిస్తారు. వీటిలో ముఖ్యంగా ఊపిరితిత్తులు, క్లోమగ్రంధులు(ప్రాంక్లియాసిస్), పేగు భాగాలను సేకరిస్తారు. వీటిని భద్రపరిచి జీవ సంబంధమైన ప్రయోగశాలల్లో పరీక్షించడం ద్వారా సంబంధిత మనిషికి గానీ, జంతువుకు గానీ ఎలాంటి పరిస్థితుల్లో దేని కారణంగా మరణం సంభవించింది అన్న విషయాన్ని తేల్చుతారు. విష ప్రయోగం జరిగినా, విష ఆహారం వల్ల మరణం సంభవించినా సంబంధింత శరీర అంతర్భాగాల్లో అందుకు సంబంధించిన మూలకాలు అలాగే ఉంటాయని నిపుణులు చెబుతుంటారు. కాగజ్‌నగర్ అడవులలో మరణించిన రెండు పులులకు సంబంధించిన ఆర్గన్స్‌తో పాటు ఆవుశరీర భాగాలను కూడా విసరా పరీక్షకు పంపినందున వాటి ఫలితాల ఆధారంగానే అసలు ఏం జరిగిందన్న నిజం వెలుగు చూసే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లింగాపూర్‌లో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

లింగాపూర్, జనవరి 9: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కోలాం గిరిజ నులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని కంచన్‌పల్లి గ్రామపం చాయతీలోగల ములాగుడా కోలాం గిరిజనులతో మంగళవారం ఆయన మా ట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు పొందాలన్నారు. ఈ మేరకుములాగుడాలో వారికోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. వైద్యాధికారులు ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. ఆదివాసీలకు ఆరోగ్య పరమైన సేవలను అందించాలని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఏప్పటికప్పుడు ఇవ్వాలని అన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం దేవానంద్, ఎంపీవో ఉమర్‌ఫరిఫ్, సర్పంచ్ కనకజ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: ప్రజా పరిపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఆన్‌లైన్ చేయాల ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మండలంలో ఇదివరకు వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభుదయ, సూరింటెండెంట్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి

ఆసిఫాబాద్, జనవరి 9: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివార అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ చేసే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో ప్రభుదేవ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, లారీ ఢీ : 15 మందికి గాయాలు



ధ్వంసమైన వాహనాలు

రెబ్బెన, జనవరి 9: రెబ్బెన మండలం ఇందిరానగర్ సమీపంలో మంగళవారం సాయంత్రం స్కూల్ బస్సు లారీ ఢీ కొన్న ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 14 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకా రం.. రెబ్బెన మండల కేంద్రంలోని అన్నపూర్ణ హై స్కూలుకు చెందిన బస్సులో సాయంత్రం డ్రైవర్ సుధాకర్ పిల్లలను తీసుకొని కొండపల్లికి బయలు దేరారు. ఈ క్రమంలో ఇందిరానగర్ వద్ద స్కూల్ పిల్లలను దించిన డ్రైవర్ రాంగ్ రూట్‌లో కొండపల్లికి వెళు తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రెండు కాళ్లు విరిగాయి. బస్సులో ఉన్న విద్యార్థులు ధనుష్, అశ్విత్, దేవిక శ్రీ, అభినవ్, విజయలక్ష్మి, వరుణ్ చంద్ర, రాంచరణ్, అక్షిత, ఆదిత్య, రవిచంద్ర, శ్రావ్య, వర్షిత్, నిఖిల్, తదితరులు గాయపడ్డారు. విద్యార్థులను కాగజ్‌నగర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. బస్సును అజాగ్రతగా, అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సుధాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

తునికాకు సేకరణ నిలిపి వేయొద్దు

- కలెక్టర్‌కు సీపీఎం నాయకుల వినతి

ఆసిఫాబాద్, జనవరి 9: పెద్దపులి సంచరిస్తుందనే సాకుతో తూనికాకు సేకరణ నిలిపి వేయవద్దని మంగళవారం సీపీఎం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వ్యవసాయం తరువాత రెండో పంటగా భావించే ఈ ప్రాంత రైతులకు అటవీ జంతువులు, ఇతర కారణాలు చూపిస్తూ తునికాకు సేకరణ నిలిపి వేసే ఆలోచన మానుకోవలన్నారు. ఈ విధానాలు ఆదివాసీలు ఆదివాసుల కడుపుకొట్టడమేనని అన్నారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 12 యూనిట్లు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 13 యూనిట్లు ఉన్నాయని చెప్పారు. గతంలో చివరి నిమిషంలో టెండర్లు పిలవడంతో ఆకు సేకరణ తగ్గిందన్నారు. ఈ సారి పెద్దపులి సంచరిస్తుందని తుని కాకు సేకరణ రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుందని, ఇది సరికాదని చెప్పారు. ఉన్నతాధికారులు దీనిపై ఆలోచించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూశన రాజన్న, శ్రీనివాస్, దివాకర్, కార్తీక్, దినకర్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 9: రాబోవు పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసి వేణులతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. సభలు సమావేశాలుప్రకటనలు, ఇతర ప్రచార కార్యక్రమంలో వినియోగించే ప్రతీ అంశాన్ని ఎన్నికల నియమావళికి లోబడి నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటర్ల జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ఏజెంట్లు, అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లాలో భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా సంక్షేమ శాఖ, విద్యా, వైద్య, గిరిజనాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన, పోలీసు శాఖ అధికారులు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గర్భిణులు ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునేలా వివరించాలని చెప్పారు. అనంతరం కార్యక్రమ సంబంధిత 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



న్యాయ సంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

రెబ్బెన, జనవరి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయసంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నంబాల గేటు నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు చేయడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్టర్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షులు స్వామి, వర్కింగ్ ప్రసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షులు లచ్చన్న, కార్యదర్శి బుచ్చన్న, రవి, ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'మెరుగైన వైద్యం అందకనే సర్దార్ మృతి'

శ్రీరాంపూర్, జనవరి 9: కాసిపేట-2 గనిలో విధులు నిర్వహిస్తున్న మచ్చ రమేష్ అనే సీనియర్ మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ మృతిచెందాడని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(టీజీఎల్‌బీకేఎస్-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు డి. బ్రహ్మానందం ఒక ప్రకటనలో తెలిపారు. గనిలో గాయపడి ఏరియా ఆస్పత్రికి వెళ్తే అతన్ని వైద్యులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. అతన్ని కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేసి ఉంటే మరణించి ఉండేవాడు కాదని తెలిపారు. మచ్చ రమేష్ కుటుంబానికి రూ.కోటి పరిహారం, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను సస్పెండ్ చేయాలని కోరారు.

కార్మికులకు లాకర్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 9: కార్మికులకు లాకర్ సౌకర్యం కల్పించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఏరియా జీఎం బి సంజీవ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు అత్యవసర అవసరాల కోసం మొబైల్స్, డబ్బులు తీసుకొని వస్తారని, వారు తమ వస్తువులు భద్రపర్చుకునేందుకు సరైన వసతులు లేవన్నారు. లాకర్ సౌకర్యం కల్పించి, దొంగతనాలు జరుగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, లక్ష్మన్, మెతుకు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- అవగాహన సదస్సులో జీఎం సంజీవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 9: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలో కార్పొరేట్(ఐటీ), హెచ్‌ఆర్‌డీ విభాగాల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం నేటి సమాజంలో తమ వృత్తులు, ఆర్థిక లావాదేవీల సమయంలో తప్పనిసరిగా మారిందని చెప్పారు. ఈ మేరకు సైబర్ నేరాలు కూడా అదేమాదిరిగా పెరిగాయని వివరించారు. మినిస్ట్రీ ఆఫ్ కోల్ అండ్ హోం ఎఫైర్స్ ఆదేశాల మేరకు జాతీయ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి ఉద్యోగులు పూర్తి అవగాహనతో తమ ఆర్థిక లావాదేవీలు, తమ వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమం లో కార్పొరేట్ డీజీ ఎం(ఐటీ) ఎం శ్రీనివాసరావు , ఎస్ఓ టు జీఎం కె రఘుకుమార్, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏజెంట్ గోపాల్ సింగ్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఐటీ ఇన్ చార్జి శ్రీనివాస్, అన్ని గనుల మేనేజర్లు, విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి'

శ్రీరాంపూర్, జనవరి 9 : సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(ఎస్‌సీకేఎస్-సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు కోరారు. సింగరేణిలోని 11 ఏరియాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ, గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన జీవోలను విడుదల చేసినా కొనేళ్లుగా గెజిట్ చేయకుండా కాలయాపన చేసందన్నారు. దీంతో జీతాలు పెరుగలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి జీవోలను గెజిట్ చేసి వేతనాలు పెంచాలని కోరారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

జైపూర్, జనవరి 9: జైపూర్‌లోని ఎస్టీపీపీలో సింగరేణి నూతన సంవత్సరం క్యాలెండర్లను మంగళవారం ఈడీ బిసివిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీకి నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ మేరకు దేశంలోనే అత్యుత్తమ ప్లాంటుగా నిలబెట్టి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రసాద్, రమణ, రామా శాస్త్రి, సముద్రాల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను జీఎం బి సంజీవరెడ్డి మంగళవారం ఆవిష్కరించా రు. కార్యక్రమంలో సంఘం కేంద్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధరవాత్ పంతులా నాయక్, ముఖ్య సలహాదారు మాలోత్ రాముడు, ఏరియా ఉపాధ్యక్షుడు భానోత్ మోహన్, ఏరియా కార్యదర్శి రాజు నాయక్, నాయకులు గోపాల్ నాయక్, భానోత్ రాము, శ్రీనివాస్, గుండేరావు, శశిధర్, రాజేశ్, గీత, సరిత, తది తరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు అభినందన

శ్రీరాంపూర్, జనవరి 9: సింగరేణిస్థాయి అధికారుల క్రికెట్ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలలో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజయం సాధించడంపై శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అభినందించారు. కొత్తగూడెంలోని రుద్రంపూర్‌లో ఈ నెల 7న జరిగిన పోటీల్లో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన అబ్దుల్ ఖాదిర్(సీనియర్ జట్టు కెప్టెన్), డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి(జూనియర్ జట్టు కెప్టెన్), క్రీడాకారులు డాక్టర్ పి. రమేష్‌బాబు, కె వెంకటేశ్వర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్, రాజేం దర్, ఎ కిరణ్‌కుమార్‌లను అభినందించారు. సింగరేణి కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించాలని ఆయన సూచించారు.

వైద్య సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 9 : రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీసైదా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏరియా ఆస్పత్రిని సందర్శించి వైద్య సదుపాయాలను పరిశీలించారు. వైద్య సదుపాయాలపై కార్మికులు అసంతృప్తితో ఉన్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే మెరుగైన వైద్య అందే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి కార్మికులు, వారి కుటుంబాలకు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌కె 5 పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగారావు, కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు రమణ, దేవేందర్ పాల్గొన్నారు.

లారీల యజమానులు సమ్మెలో పాల్గొనవద్దు

శ్రీరాంపూర్, జనవరి 9: సింగరేణిలో బొగ్గు రవాణా చేసే లారీల యజమానులు దేశ వ్యాప్తంగా ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లారీల సమ్మెలో పాల్గొనవద్దని సింగరేణి యాజమాన్యం మంగళవా రం ఒక ప్రకటనలో కోరింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లారీ డ్రైవర్‌కు గరిష్ఠంగా పదేళ్ల జైలు, రూ. 7 లక్షల జరిమానా విధించేలా భారతీయ న్యాయ సంహిత చట్టంలో మార్పులు చేయడం వల్ల లారీల సమ్మెకు పిలుపు ఇచ్చారని తెలిపింది. కానీ కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఈ నెల 2న లారీల అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారని తెలిపింది. వాహనరంగంలో ఉన్న వ్యక్తులతో చర్చించిన తరువాతే నూతన చట్టాన్ని ఇప్పుడే అమల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారని వివరిం చింది. ఈ విషయాన్ని గమనించి సమ్మెలో లారీల డ్రైవర్లు, యజమానులు పాల్గొనవద్దని కోరింది.

చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఆసిఫాబాద్, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ అద్దె బస్సుల ఓనర్లు మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎం శ్రీధర్ మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్ష, ఏడు లక్షల రూపాయల జరిమానా విధించడం అత్యంత దారుణం అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, అప్పటి వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. తమకు ఇబ్బందిగా పరిణమించిన చట్టంపై పునరాలోచించాలని కోరారు. క్యాక్రమంలో హైర్ బస్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శ షఫీ, ఏఐటీయూసీ నాయకుడు దివాకర్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జనవరి 9: నిరుద్యోగ యువతీ యువకులు టాస్క్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో జిల్లా ఎగ్జామినేషన్ అధికారి ఉదయ్‌బాబుతో కలిసి మంగళవారం పాల్గొని బేసిక్ ఐటీ స్కిల్, సాఫ్ట్ స్కిల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. టాస్క్ ద్వారా ప్రతి ఒక్కరూ టెక్నికల్ జ్ఞానాన్ని పొందవచ్చని అన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ టాస్క్ సేవలు సద్వినియోగం చేసుకుని కంప్యూటర్ రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ రీజనల్ మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కౌటాల, జనవరి 9: కౌటాల పోలీసు స్టేషన్ పరిధిలోని విజయ నగరం గ్రామానికి చెందిన పోలిశెట్టి బాలస్వామి(48) అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న కుటుంబీకులు హైదరాబాద్‌కు వెళ్లగా బాలస్వామి ఒక్కడే ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చూస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం గుడ్లబోరి గ్రామ శివారులోని తన పొలానికి వెళ్తుండగా రోడ్డుపై కల్వర్టుకు ఢీ కొని కింద పడిపోయాడు. రాత్రి కావడంతో ఎవరు గమనించలేదు. కుటుంబీకులు ఫోన్ చేసినా తీయక పోవడంతో అనుమానం వచ్చి మంగళవారం కుటుంబీకులు గ్రామానికి వచ్చి వెతికారు. ఈ మేరకు గుడ్లబోరి గ్రామ సమీపంలోని కల్వర్టు కింద పడి మృతి చెంది కనిపించాడు. మృతుడి కుమార్తె ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.